# దేశంకోసం

= రచన: శ్రీ డి. ఏ. రాజ్ =



'చూడండి, భారతీ!' మెట్లు దిగి వెళ్తోన్న భారతిని వుద్దేశించి అన్నాడు శేఖర్.

'ఏమిటి?' అంటూ ఆగి వెనక్కి తిరిగింది భారతి ఆశ్చర్యంగా.

'మీరు...మీరు...' అని ఆగిపోయాడు శేఖర్ తడబడుతూ.

'ఏమిటి? నేను. నేను, నేనే! చెప్పండి' అంది భారతి నవ్వుతూ.

'ఏమీ-ఏమీ లేదు' అన్నాడు శేఖర్ బెరుగ్గా!

'థాంక్స్! అందుకేనా పిలిచారు? వస్తాను' నవ్వుకుంటూ వెళ్ళిపోయింది భారతి.

శేఖర్-భారతి వొకే కాలేజీలో వొకే క్లాసులో చదువుతున్నారు. మొదటి సారిగా భారతిని చూసినపుడు శేఖర్ గుండెలు వడి వడిగా కొట్టుకున్నాయి. అంతవరకూ అమ్మాయిలకేసి కన్నెత్తి చూడని శేఖర్ భారతి అంటే ఒకవిధమైన మమతలు పెంచుకున్నాడు. ఆ వయస్సులో దాన్ని చాలా మంది ప్రేమ అంటారు. కానీ యవ్వనం ఆరంభంలో అమ్మాయి లందరిలోనూ, ఏదో ఒక గొప్పతనం కనుపిస్తుంది. కొందరి నడకలో, కొందరి మాటల్లో, మరి కొందరి కంటి మెరుపులో విశిష్టత కనిపిస్తూ ఉంటుంది. యవ్వానానికి వీటిని విడదీసి సౌందర్యారాధన చేసే శక్తిలేదు. ఏ మాత్రం అదం ఉన్నా యవ్వనం కనిపెట్టేస్తుంది. దాన్ని చాలా మంది ప్రేమ అంటారు- నిజానికది ప్రేమకాదు.

కానీ శేఖర్ భారతిమీద పెంచుకున్న మమత నిజమైన ప్రేమ. అంతవరకూ అమ్మాయి లెవరితోనూ మాట్లాడకపోవడం వల్ల, శేఖర్ ఆమెతో మాట్లాడానికి బిడియ పడ్డాడు. చివరికి తెగించి ఆమెతో మాట్లాడాడు.

× × ×

'పాకిస్తాన్, భారత దేశం మీద యుద్ధాన్ని ప్రకటించింది. స్వలాభం, యుద్ధోన్మాదత విస్తారంగా వుంది ఆ దేశపాలకుల్లో. భారత మాత భాగ్యాన్ని చూసి కన్నుకుట్టింది

పాకిస్తాన్‌కి. అక్రమంగా ప్రవేశించినందుకు కాలుదువ్వింది.

భారతవీరులు పిరికి పందలు కారు. ధైర్య సాహసాలకు భరతఖండం మారుపేరు. ఆవేశంతో ఎదురు నిలిచారు మనజవానులు ఎదురొచ్చిన జవానుల్ని వదిలి, అమాయ జీవుల మీద, పాడిపంటలకు నిలయమైన గ్రామాల మీద అగ్ని వర్షం కురిపించింది పాకిస్తాను.

చరిత్రలో చిరస్థాయిగా నిలిచిన దేవాలయాల్ని, చికిత్సాలయాల్ని నేలమట్టం చేసింది. పాకిస్తాన్.

న్యాయం జయిస్తుంది-అధర్మం నశిస్తుంది.

ఈ అత్యవసర పరిస్థితుల్లో ప్రతీ యువతీ యువకులూ ముందంజవేసి మాతృదేశ రక్షణకై పాటుపడాలి. దేశరక్షణ నిధికి విరివిరిగా విరాళాలందజెయ్యాలి.' అంతవరకూ ఉద్రేకంతో చెప్పుకుపోయిన భారతి కంఠం ఆగిపోయేసరికి ఒక్కసారిగా కరతాళ ధ్వనులు చేశారు ప్రేక్షకులంతా.

ముఖానికి పట్టిన చిరుచెమట కొంగుతో సుకుమారంగా అద్దుకొంటూ వేదిక దిగుతున్న భారతిని సంభ్రమాశ్చర్యాలతో చూస్తూ నిలబడి పోయాడు శేఖర్.

మర్నాడు వంటరిగా వస్తున్న భారతిని చూసి—

'కంగ్రాట్యులేషన్స్ చాలా బాగా చెప్పారు నిన్న' అన్నాడు.

'థేంక్స్' అంది భారతి నవ్వుతూ.

'భారతీ మిమ్మల్ని నా సహోదరిగా ప్రేమిస్తున్నా' అనేసాడు ఒక్కసారిగా.

'విస్తుపోయింది భారతి'

'చూడండి శేఖర్ ప్రేమలకి, యిది సమయం కాదు. భారతి మీద ప్రేమ భారతదేశం మీద చూపెట్టండి. స్త్రీ ఎప్పుడూ పురుషుడిలో ధైర్యసాహసాలకే ప్రాధాన్యమిస్తుంది. ఏ స్త్రీ తన స్నేహితుడైనా, ప్రియుడైనా, భర్త అయినా పిరికి వాడైతే సహించలేదు.

నేను మిమ్మల్ని మనస్ఫూర్తిగా సహోదరనుగా ప్రేమిస్తున్నాను. మీరు దేశాన్ని ప్రేమించండి. సైన్యంలోచేరి మీ దేశభక్తిని నిరూపించండి. మీ క్షేమ సమాచారాన్నెప్పుడూ ఈ భారతి కోరుతూ ఉంటుంది' అంది భారతి.

'భారతీ నాకింతవరకూ దేశభక్తి,యుద్ధం వీటిమీద ఎలాంటి అభిప్రాయం లేదు. నీకోసం, సైన్యంలో చేరుతాను.' అన్నాడు శేఖర్ ధైర్యంగా. ఆ మర్నాటినుండీ శేఖర్ జాడ తెలియలేదు భారతికి. రోజులు భారంగా గడుస్తున్నాయి. యుద్ధం తీవ్రరూపం దాలుస్తోంది.

అర్ధరాత్రి హఠాత్తుగా దాడిచేసి యిష్టం వచ్చినట్టు బాంబులు వేసిపోతున్నాయి శత్రు విమానాలు.

ధైర్యసాహసాలతో పోరాడుతున్నారు మన జవానులు. మన సేనల దాడికి తట్టుకోలేక పోతోంది శత్రు బలం. 'శరణు' లంటూ దొరికిపోయారు కొందరు. అక్రమంగా ఎదురు నిలిచి పోరాడి యమపురికి అతిథులుగా పోతున్నారు. యుద్ధసామాగ్రి వదిలి పలాయన చేస్తున్నారు. విజయోత్సాహంతో పోరాడుతున్నారు భారత వీరులు. యిరవైనాలు

గ్గంటలూ రేడియోముందు కూర్చుంటోంది భారతి.

ఆనాడే భారతి పేరుతో ఒక కవరొచ్చింది. ఆత్రంగా విప్పింది.

'ప్రియమైన భారతీ.'

నీ ఆశీర్వాద బలంతో క్షేమంగా ఉన్నాను. పాకిస్తాన్ మన ధాటికి ఆగలేదు భారతీ. నేను ప్రస్తుతం లాహోర్ ప్రాంతంలో ఉన్నాను. శత్రు సేనల్ని చీల్చుకుంటూ ముందుకు పోతున్నాం. జయం మనదే. నీ ప్రేమే నా నరనరాల్లోనూ ధైర్య సాహసాల్ని జనింపజేస్తోంది. నిన్ను చూడాలని ఉంది భారతి.

క్షణక్షణానికి చుట్టుముట్టే ఈ ప్రమాద ప్రదేశాల్లో నీ పేరు తలుచుకుంటే చాలు భారతీ! నేనీ లోకాన్నే జయించగలను. కులాసాగా ఉన్నావుకదూ? త్వరలోనే మళ్ళీ ఉత్తరం రాస్తా.

ఇట్లు,
నీ
శేఖర్.

కళ్ళనీళ్ళతో హృదయానికి హత్తుకుంది భారతి ఆ ఉత్తరాన్ని.

అదే సమయంలో 'టెలిగ్రామ్' అన్న కేకతో గుమ్మంలోకి పరుగెత్తింది భారతి.

వణుకుతున్న చేతుల్తో విప్పింది.

ఆ ముందు రోజు రాత్రి పోరాటంలో శేఖర్ వీరస్వర్గం పొందినట్లుంది! అందులో.

(మాతృదేశ రక్షణకై ధైర్యస్థైర్యాలతో పోరాడి అమర వీరులైన సోదర జవానులకీ కథానిక అంకితం.)

ఎల్లప్పుడూ ''శకుంతలా'' బనియన్లనే ధరించండి!!

